క్లుప్తంగా

కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి


విలేకరులతో మాట్లాడుతున్న సొధాగర్ ప్రజలు

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్ టీడీపీ తొత్తుగా వ్యవహరిస్తూ పేదల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పట్టణంలోని సొధాగర్‌కు చెందిన స్థానికులు ఆరోపించారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ... సొధాగర్ ప్రాంతం పరిధిలో ఉన్న కుమ్మరగేరిలో కొందరు రోడ్డును మూసివేసినా కమిషనర్ పట్టించుకోలేదన్నారు. వాహన రాకపోకలకు ఇబ్బందులు ఎదురవడంతో స్థానికులే డబ్బులు వేసుకొని జేసీబీతో రెండు అడుగుల గుంతను పూడ్చివేశారన్నారు. అయితే కమిషనర్ టీడీపీ వారితో కుమ్మక్కై పనిచేస్తున్న జేసీబీని సీజ్ చేశారన్నారు. ఎన్నికను అడ్డు పెట్టుకుని వైఎస్సార్‌సీపీ నాయకుడు యాసిన్ తదితరులపై కేసు నమోదు చేయించారన్నారు. టీడీపీ తొత్తుగా వ్యవహరిస్తున్న కమిషనర్‌ను వెంటనే విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు.

చోరీకి విఫలయత్నం

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలో సోమవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. పాత హైస్కూల్ సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ అపహరించడానికి ప్రయత్నించారు. అదే విధంగా వైఎస్సార్ సర్కిల్‌లోని ఓ ఇంటి తలుపులు పగల కొట్టడానికి ప్రయత్నించగా రెండు చోట్ల తలుపులు తెరచుకోకపోవడంతో దుండగులు పరారయ్యారు. పోలీసులు నిఘా పెంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'జాబిలి'కి తెలుగు సాహితీ పురస్కారం


పురస్కారం అందుకుంటున్న జాబిలి చాంద్‌బాషా

పెనుకొండ: పట్టణానికి చెందిన ప్రముఖ కవి జాబిలి చాంద్‌బాషాకు తెలుగు సాహితీ పురస్కారం లభించింది. సోమవారం రాత్రి అనంతపురంలోని అనంత సాహితీ కన్వెన్షన్ హాల్లో మీనాక్షి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన బిక్కి కృష్ణ సాహితీ సమాలోచన కార్యక్రమంలో జాబిలి చాంద్‌బాషాకు పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, కళారత్న బిక్కికృష్ణ, డా.వి.రాజ్‌గోపాల్ తదితరుల చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

3న మండల సర్వసభ్య సమావేశం

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలోని శ్రీశక్తి భవనంలో మే 3వ తేదీ ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు జి.వెంకటరత్నమ్మ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ వాసుదేవ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

వలంటీర్ల రాజీనామా


రాజీనామా లేఖలను పంచాయతీ అధికారికి అందిస్తున్న వలంటీర్లు

హిందూపురం: నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తున్న తమపై కక్ష కట్టి టీడీపీ అండ్ కో చేస్తున్న కుట్రలు, కుతంత్రాలకు ప్రజలే సరైన బుద్ధి చెబుతారని వలంటీర్లు ముక్తకంఠంతో అన్నారు. హిందూపురం మండలంలోని చలివేందులకు చెందిన 14 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కేంద్రంలోని అధికారికి మంగళవారం అందజేశారు. హిందూపురం నియోజకవర్గంలో ఇప్పటి వరకూ సుమారు 400పైగా వలంటీర్లు రాజీనామా చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


ఆలయంలో హోమం నిర్వహిస్తున్న పురోహితులు

మడకశిరరూరల్: మండలంలోని జమ్మానిపల్లిలో వెలసిన లక్ష్మీ నిడిమామిడమ్మదేవి ఆలయ 37వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి జ్యోతులు సమర్పించారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

ఉల్లాసంగా... ఉత్సాహంగా

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప నామినేషన్ కార్యక్రమం విజయవంతం
- నూతనోత్సాహంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు


అభివాదం చేస్తూ ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, ఎంపీ అభ్యర్థి శాంతమ్మ

మడకశిర రూరల్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప నామినేషన్ మంగళవారం అట్టహాసంగా జరిగింది. నామినేషన్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరుకావడంతో ఆ పార్టీలో నూతనోత్సాహం నెలకొంది. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి జై జగన్ అంటూ నినాదాలు చేసుకొంటూ బైక్ ర్యాలీగా మడకశిరకు తరలివచ్చారు.

గుడిబండ: మండలం నుంచి పెద్ద సంఖ్యలో మంగళవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప నామినేషన్‌కు తరలివెళ్లారు. మండల కేంద్రం నుంచి బైక్ ర్యాలీగా వందలాది మంది ఉత్సాహంగా మడకశిర బయలు దేరారు. జై జగన్... జై జై జగన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు.

అమరాపురం: మడకశిర వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప నామినేషన్ కార్యక్రమానికి మండలం నుంచి అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం వివిధ వాహనాల్లో తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షుడు హాలుకూరు కాంతరాజు ఆధ్వర్యంలో వంద వాహనాలతో మడకశిరకు వెళ్లారు. ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, వైస్ ఎంపీపీ లలితమ్మ, మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

మెజార్టీతో గెలిపించాలి

మడకశిరరూరల్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప నామినేషన్ కార్యక్రమానికి అనంతపురం జిల్లా లీగల్ సెల్ మాజీ అధ్యక్షుడు బీ నారాయణరెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శులు రమణయాదవ్, జాఫర్ సిద్దిక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద కుటుంబానికి చెందిన ఈరలక్కప్పను ఎమ్మెల్యే అభ్యర్థిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంపిక చేసి నూతన ఒరవడి సృష్టించారని తెలిపారు. ఈరలక్కప్పను మంచి మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపాలన్నారు.

మాల ఐక్యవేదిక మద్దతు

మడకశిరరూరల్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పను మంగళవారం ఉమ్మడి అనంతపురం జిల్లా మాల ఐక్యవేదిక అధ్యక్షుడు గంగాధర్ కలిసి సంపూర్ణ మద్దతు తెలిపారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈరలక్కప్ప గెలుపునకు సమిష్టిగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు సోమశేఖర్‌రెడ్డి, మల్లికార్జున, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు కృతజ్ఞతలు

రొళ్ల: మడకశిరలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్.ఎల్.ఈరలక్కప్ప నామినేషన్ కార్యక్రమానికి మంగళవారం ప్రతి గ్రామం నుంచి తరలివచ్చి విజయవంతం చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు తాలూకా అసెంబ్లీ ఇన్‌చార్జ్ అనంతరాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జై జగన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలతో వేలాదిగా తరలివచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం పెరిగిందన్నారు. భారీ మెజార్టీతో ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్.ఎల్.ఈరలక్కప్పను గెలిపించి సీఎం వైఎస్ జగన్‌కు కానుకగా అందించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.


ఆమిదాలగొంది నుంచి నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చిన పార్టీ శ్రేణులు


గుడిబండ నుంచి బైక్ ర్యాలీగా తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలు


అమరాపురం మండలం నుంచి బయలుదేరుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నేడు దీపిక నామినేషన్



హిందూపురం: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా టీఎన్ దీపిక బుధవారం అట్టహాసంగా నామినేషన్. దాఖలు చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి తెలిపారు. ముందుగా ఉదయం 7.30 గంటలకు సర్వమత ప్రార్థనల్లో పాల్గొంటారన్నారు. అనంతరం 8 గంటలకు స్థానిక సూగురు ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని చెప్పారు. అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరతారని తెలిపారు. వాల్మీకి సర్కిల్, చిన్న మార్కెట్, మెయిన్ బజార్ మీదుగా గాంధీ సర్కిల్ నుంచి అంబేడ్కర్ సర్కిల్‌కు చేరుకొని భారీ బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తారని పేర్కొన్నారు. నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గురుకుల పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత


గణకుమార్ (572)


నవనీత్ (560)


రాజవర్ధన్ (555)

లేపాక్షి: మండలంలోని నాయనిపల్లి క్రాస్ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల (బాలురు)లో 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ మధుసుధన్‌రావు తెలిపారు. పాఠశాలలో 69 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. అందులో ఐదుగురు విద్యార్థులు 550 పైగా మార్కులు సాధించారని చెప్పారు. డీ.గణకుమార్ 572, టి.నవనీత్ 560, ఏ.రాజవర్ధన్ 555 మార్కులు సాధించారన్నారు. వందశాతం ఫలితాలు సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అభినందించారు.

నామినేషన్‌కు తరలిరండి


నామినేషన్ ఆహ్వాన పత్రికల పంపిణీలో పాల్గొన్న నాయకులు

రొద్దం: మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ ఈ నెల 25న నామినేషన్ వేయనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఇందులో భాగంగానే మంగళవారం మంత్రి తరఫున నాయకులు ప్రతి గ్రామానికి వెళ్లి నామినేషన్ కార్యక్రమానికి ఆహ్వానించారు. ప్రజాప్రతినిధులు, నాయకుల, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, నాయకులు సి.నారాయణరెడ్డి, అక్కులప్పయాదవ్, బి.నారాయణరెడ్డి, ఎస్ నారాయణరెడ్డి, మారుతిరెడ్డి, వినయ్ రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, రాజారెడ్డి, రాజ్‌గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక


వైఎస్సార్‌సీపీలో చేరిన పీజే రాజన్నతో జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్ తదితరులు


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మధూడి సర్పంచ్ శివకుమార్

మడకశిర: గుడిబండ మండలం సీసీగిరి గ్రామానికి చెందిన ప్రముఖుడు పీజే రాజన్న అసెంబ్లీ ఇన్‌చార్జ్ అనంతరాజు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు నవీన్‌నిశ్చల్, పార్టీ పరిశీలకులు పోకల అశోక్‌కుమార్, ప్రసాద్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి శాంతమ్మ సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఈయన గతంలో వైఎస్సార్‌సీపీలో చురుగ్గా పని చేశారు. కొన్ని కారణాల వలన పార్టీకి దూరమయ్యారు. మళ్లీ ఆయన పార్టీలో చేరి ఈరలక్కప్ప, శాంతమ్మ గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గుడిబండ జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, స్థానిక నాయకులు అశ్వత్తనారాయణ పాల్గొన్నారు.

అగళి: మండల పరిధిలోని మధూడి పంచాయతీకి చెందిన భరత్, బసవరాజు, హనుమంతరాయ (కెంచబుడి), తిప్పన్న వారి అనుచరులతో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. సర్పంచ్ శివకుమర్, నాయకుడు సుర్యనారాయణరెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మడకశిర అసెంబ్లీ అభ్యర్థి ఈరలక్కప్ప గెలుపునకు సైనికుల్లా పనిచేసి భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణకుమార్, హరీష్, వినయ్, శివన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు రక్షణ కల్పించండి


ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

పావగడ: కళాశాలల్లో విద్యార్థినులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా రక్షణ కల్పించాలని స్థానిక విశ్వ హిందూ పరిషత్, ఏబీవీపీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్ణాటక రాష్ట్రంలోని హుబ్లీలో కేఎల్ఈ ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల చోటు చేసుకున్న లవ్ జిహాదీ ఘటనలో ఫయాజ్ అనే యువకుడు నేరా హీరేమఠ అనే విద్యార్థినిని కళాశాల తరగతి గదిలోనే అత్యంత కిరాతకంగా హతమార్చడం శోచనీయమన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఏబీవీపీ, వీహెచ్‌పీ నాయకులు స్థానిక తాలూకా కార్యాలయంలో మంగళవారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. వెంటనే నిందితుడిని అరెస్ట్ చేసి కఠిన శిక్ష విధించి హతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ యంత్రాంగం కళాశాలలు, పాఠశాలల వద్ద పోలీస్ నిఘా ఏర్పాటు చేయాలన్నారు. బీజేపీ నాయకులు వెంకట్రామయ్య, జిల్లా కార్యదర్శి రవి, ఏబీవీపీ పట్టణ కార్యదర్శి మనోజ్ కుమార్, నందీశ్ నాయక్, రామకృష్ణ, మహేశ్, అశ్విని, రేణుక తదితర కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు.

మడకశిరలో ఐదు నామినేషన్ల దాఖలు

మడకశిరరూరల్: మడకశిర అసెంబ్లీ స్థానానికి మంగళవారం ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని ఆర్ఓ గౌరీ శంకర్ ప్రసాద్ తెలిపారు. ఎస్ఎల్ ఈరలక్కప్ప, పవిత్ర, ఆర్ గురుమూర్తి, బీ కరినింగప్ప, హనుమంతరాజు నామినేషన్ పత్రాలను అందించారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ తరుపున ఈరలక్కప్ప నామినేషన్ దాఖలు చేశారు. మిగిలివారు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లను వేశారు.

'పురం'లో ముగ్గురు

హిందూపురం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం మూడు నామినేషన్లు దాఖలు అయ్యాయి. హిందూపురం తహసీల్దార్ కార్యాలయంలో సంయుక్త కలెక్టర్, నియోజకవర్గ ఆర్ఓ అభిషేక్‌కుమార్ ఆధ్వర్యంలో హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ నామినేషన్లు స్వీకరించారు. స్వతంత్ర అభ్యర్థిగా పరిపూర్ణానంద స్వామిజీ, జై భీమ్ భారత్ తరుపున జి.నాగరాజు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సమితి పార్టీ తరుపున కోడుమూరు నౌషాద్ నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటి వరకు హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గానికి 12 నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఇందులో ముగ్గురు అభ్యర్థులు రెండేసి సెట్లు నామినేషన్ దాఖలు చేశారు. డీఎస్పీ కంజాక్షన్ ఆధ్వర్యంలో నామినేషన్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెనుకొండలో ఐదు...

పెనుకొండ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పెనుకొండ అసెంబ్లీ స్థానానికి మంగళవారం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థులుగా మహేష్, ఈడిగ నరేంద్రగౌడ్, సుగాలి గణేష్‌నాయక్, టీడీపీ అభ్యర్థి సవితమ్మ తరపున రవికుమార్, కుమార్ చెరో నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి సబ్‌కలెక్టర్ అపూర్వభరత్ నామినేషన్ పత్రాలను స్వీకరించారు.

జోరుగా ఎన్నికల ప్రచారం


పరిగిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


పెనుకొండలో ప్రచారం చేస్తున్న నాయకులు

పరిగి: మండలంలోని పలు గ్రామాల పంచాయతీ పరిధిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఉషశ్రీచరణ్, శాంతమ్మలకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకులు జోరుగా ప్రచారం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేయాలని ఓటర్లను కోరారు. అలాగే 25న ఉషశ్రీచరణ్ నామినేషన్ కార్యక్రమాన్ని తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

పెనుకొండ: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ గెలుపు కోసం పట్టణంలోని చెరువు రోడ్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కౌన్సిలర్ చంద్రకళ, నాయకులు కిష్టప్ప, కుమ్మరదొడ్డిలో కౌన్సిలర్ సద్దాం ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, మున్సిపల్ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమజ్జయంతి


అలంకరణలో సూగురు ఆంజనేయస్వామి


పెనుకొండలో ఊరువాకిలి ఆంజనేయస్వామి

హిందూపురం: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని సూగురు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే దండురోడ్డులోని రాతి అభయ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద పూజలు జరిగాయి. కాలువగట్టు వద్ద ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి, కొల్లకుంట ఆంజనేయస్వామి తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

పెనుకొండ: పట్టణంలోని ఊరువాకిలి ఆంజనేయ స్వామి, ఎగువగడ్డ ఆంజనేయస్వామి, మిట్టాంజనేయ స్వామి తదితర ఆంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మృత్యువుతో పోరాడి ఓడిన బాలుడు


చేతన్ (ఫైల్)

పావగడ: ఓ బైకు ప్రమాదంలో గత నెల 23న తీవ్ర గాయపడ్డ చేతన్ (12) తుమకూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. తాలూకాలోని భీమనకుంటె గ్రామానికి చెందిన ఆలయ పూజారి సంపత్‌కుమార్, సాయిశ్రీ దంపతుల రెండో కుమారుడు చేతన్ నెల క్రితం వైఎన్ హొసకోటలో 6వ తరగతి పరీక్ష రాయడానికి స్కూటర్‌లో మరో ఇద్దరు పిల్లల్ని ఎక్కించుకుని పాఠశాలకు బయలుదేరాడు. అయితే ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో పిల్లలందరూ కిందకు పడ్డారు. స్కూటర్ నడుపుతున్న చేతన్ తలకు తీవ్రగాయాలవడంతో అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కోమాలో ఉన్న ఆ చిన్నారికి వైద్యులు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. బాలుడి ఆరోగ్యం కుదుటపడక పోవడంతో రెండు రోజుల క్రితం డిశ్చార్జ్ చేశారు. కొన ఊపిరిలో ఉన్న చేతన్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ చేతన్ మంగళవారం తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్థానికులు కన్నీరు మున్నీరయ్యారు.

వైభవంగా రంగనాథస్వామి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు


పూజల్లో పాల్గొన్న మంత్రి ఉషశ్రీచరణ్

సోమందేపల్లి: మండలంలోని గుడిపల్లి గ్రామంలో సజ్జగంట రంగనాథస్వామి రథోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి వివిధ పూజలు చేశారు. అనంతరం వేలాది మంది భక్తుల సమక్షంలో రథోత్సవం కనుల పండువగా సాగింది. సోమవారం రాత్రి స్వామి వారి కల్యాణోత్సవాన్ని ఆలయ ధర్మకర్త రమాకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

హిందూపురం అర్బన్: పట్టణ సమీపంలోని పూలకుంట వద్ద మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరవపల్లికి చెందిన శ్రీరాములు (45) మృతి చెందారు. లేపాక్షి రహదారిలో టాటా ఏస్ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకొంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నామినేషన్‌ను విజయవంతం చేయాలి

హిందూపురం: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్.దీపిక బుధవారం నామినేషన్ దాఖలు చేస్తున్నారని, హిందూపురం మండలంలోని అన్ని పంచాయతీల నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చేలా కృషిచేయాలని వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం చౌళూరు గ్రామంలో పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు.

మారెమ్మకు హారతులు

అమరాపురం: మండల పరిధిలోని వలస గ్రామంలో వెలసిన మారెమ్మ దేవికి మంగళవారం భక్తులు ఘనంగా హారతి ఉత్సవాన్ని నిర్వహించారు. ప్రత్యేక పూజల తర్వాత అమ్మవారి ఆలయం చుట్టూ మహిళలు ప్రదక్షిణలు చేశారు. అనంతరం హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.